అడుగుకో గుంత..!

- అధ్వానంగా హయత్‌నగర్ - ఇంజాపూర్ రోడ్డు
- వర్షానికి దెబ్బతిన్న రహదారులు
- పట్టించుకోని అధికారులు
- నరకయాతన పడుతున్న వాహనదారులు





రోడ్డుపై నిలిచిన మురుగునీరు

హయత్‌నగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ నుంచి ఇంజాపూర్‌కు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆ రహదారి అడుగుకో గుంత అన్న చందంగా తయారైంది. ఎక్కడ చూసిన గుంతలు పడి, బురదమయమైన దారులే కనిపిస్తున్నాయి. ఆ దారిలో ప్రయాణించాలంటే వాహనదారులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. అయినా ఇప్పటి వరకు సంబంధిత అధికారులు స్పందించలేదు. దీనిపై స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుంతలమయంగా రహదారి..

హయత్‌నగర్ నుంచి ఇంజాపూర్‌కు వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ముఖ్యంగా జైస్వాల్ ఫర్నిచర్ షో రూం నుంచి సర్వే నంబర్ 191 వరకు రోడ్డు మొత్తం పాడైపోయింది. ఆ దారిలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. లక్ష్మీప్రియకాలనీ వద్ద వాహనాలు గుంతల్లో ఇరుకుపోతున్నాయి. రాత్రి వేళలలో ద్విచక్ర వాహనం దారులు కింద పడుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఎప్పుడు రద్దీగా ఉండే ఈ రహదారిని ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతలమయమైన రహదారులకు తోడు హోటల్ నిర్వాహకులు మురుగునీరును రోడ్డుపైకి వదులుతున్నారు. దీంతో రోడ్డుపై మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతుంది. దీనిపై జీహెచ్‌ఎంసీ శానిటేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన కనీసం పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు అంటున్నారు. పాడైన రోడ్లలో ప్రమాదాలు జరుగుతున్న పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

గుంతలమయమైన రహదారిలో ప్రయాణిస్తున్న వాహనాలు



హయత్‌నగర్ నుంచి ఇంజాపూర్‌కు వెళ్లే మార్గంలో పాడైన రోడ్డు

హరీశ్‌రావుతో సదానంద్‌రెడ్డి



కొత్తపేటలో నిర్మాణంలో ఉన్న టిమ్స్ ఆస్పత్రి పరిశీలనకు వచ్చిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును శనివారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ చంపాపేట సీనియర్ నాయకుడు బొక్క సదానంద్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట పార్టీ నాయకులు శ్రీనాథ్, చందూయాదవ్, ఉమామహేశ్వర్, వసంత్, శేఖర్‌రెడ్డి, సతీష్, సిద్ధు, గోపి తదితరులు ఉన్నారు. - చంపాపేట, ఆంధ్రజ్యోతి

బస్సు షెల్టర్లు నిర్మించాలి

హయత్‌నగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ నుంచి వనస్థలిపురం వరకు బస్సు షెల్టర్లు నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హయత్‌నగర్‌లో శనివారం సీపీఎం మండల శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ రహదారి విస్తరించడంతో ప్రయాణికుల సంఖ్య పెరిగిందన్నారు. హయత్‌నగర్ నుంచి వనస్థలిపురం రహదారిలో బస్సు షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా రోడ్డు దాటడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని, హయత్‌నగర్ చౌరస్తాలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్యనారాయణ, గణేష్‌గౌడ్ పాల్గొన్నారు.



శ్రీనివాస్‌గుప్తాను సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న విజయవాడ దుర్గమ్మ ఆలయ కమిటీ చైర్మన్

దుర్గమ్మ ఆశీస్సులతో అందరూ బాగుండాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలంతా సుఖ శాంతులతో ఉండాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఆకాంక్షించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయవాడ కనకదుర్గ అమ్మవారిని శనివారం శ్రీనివాస్‌గుప్తా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం ఆలయ వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఏపీ ఎమ్మెల్యే శ్రీరాంరాజగోపాల్ తాతయ్య సమక్షంలో శ్రీనివాస్‌గుప్తాను ఆలయ కమిటీ చైర్మన్ శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఆయన వెంట శ్రీనివాస్ సతీమణి ఉప్పల స్వప్న, కుమారులు సాయికిరణ్, సాయితేజ, కోడలు శార్వారీ ఉన్నారు.



గ్రూప్-1 విజేతలను సన్మానిస్తున్న ఆర్యవైశ్య మహాసభ నేతలు

గ్రూప్-1 విజేతలకు సన్మానం

సైదాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రూప్ వన్‌లో ఉత్తమ ఫలితాలు సాధించి ఉద్యోగాలు పొందిన ఆర్యవైశ్యులను తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అభినందించారు. ఈ మేరకు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యాలయంలో శనివారం గ్రూప్ వన్ ఉద్యోగాలు సాధించిన ఆర్యవైశ్య అభ్యర్థులను శాలువాతో సత్కరించారు. ఆర్యవైశ్యులు వ్యాపారాలకే పరిమితం కాకుండా ఉద్యోగాలు సాధించడం గొప్ప విషయమని లక్ష్మీనారాయణ అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ నాయకులు గణేష్‌గుప్తా, మలికార్జున్‌గుప్తా, వెంకటేష్, లక్ష్మణ్‌గుప్తా, రవికుమార్, లక్ష్మయ్యగుప్తా, శ్రీనివాస్, సుష్మా తదితరులు పాల్గొన్నారు.

డబ్బుల విషయంలో గొడవ.. వ్యక్తిపై హత్యాయత్నం

చంపాపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అప్పుల విషయంలో గొడవ వ్యక్తి హత్యాయత్నానికి దారి తీసింది. ఈ సంఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హఫీజ్‌బాబానగర్‌కు చెందిన షేక్‌సైఫ్(25), మహ్మద్ బిన్ అబ్దుల్లా బవాజిర్‌కు రూ.30వేల హ్యాండ్‌లోన్ ఇచ్చాడు. షేక్ సైఫ్ అతణ్ని శనివారం సాయంత్రం ఓవైసీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ సమీపంలో కలిసి డబ్బులు ఇవ్వమని అడగడంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారు. దీంతో మహ్మద్ బిన్ అబ్దుల్లా బవాజిర్ చాకుతో షేక్ సైఫ్‌పై మెడ, భుజంపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచి పారిపోయాడు. స్థానికులు గాయపడిన షేక్‌సైఫ్‌ను చికిత్స నిమిత్తం ఓవైసీ ఆస్పత్రికి తరలించారు. షేక్‌సైఫ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని డీసీకి వినతి

రామంతాపూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రామంతాపూర్ డివిజన్ సాయికృష్ణనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ శనివారం సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ, ఉప్పల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. కాలనీలో రోడ్డు లేని కారణంగా పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన డీసీ రోడ్డు స్థితిగతులపై సమగ్ర నివేదికను రూపొందించి సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించినట్లు బాలకృష్ణ తెలిపారు.



లడ్డూ, చీర, కలశం దక్కించుకున్న వారితో ఉత్సవ సమితి ప్రతినిధులు

ఘనంగా అమ్మవారి నిమజ్జనం

- గుర్రంగూడలో రూ.1.80లక్షలు పలికిన లడ్డూ

సరూర్‌నగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో అమ్మవారి నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. దుర్గామాత ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని శనివారం నిర్వాహకులు స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలంపాటలో లడ్డూను రూ.1.80లక్షలకు చిప్ప వెంకటేశ్, అమ్మవారి చీరను రూ.1.01లక్షకు మాజీ కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డి, కలశాన్ని జక్కిడి గోవర్ధన్‌రెడ్డి రూ.43వేలకు కైవసం చేసుకున్నారు. అనంతరం అమ్మవారిని ఆటపాటలతో, భజనలతో ఊరేగించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులు రాజవర్ధన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, భాస్కర్, సురేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, జంగయ్య, వెంకట్‌రెడ్డి, సాయికిరణ్‌గౌడ్, శ్రీహరి, గణేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- గడ్డిఅన్నారం ఏఎంసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి
- అబ్దుల్లాపూర్‌మెట్‌లో కాంగ్రెస్ నాయకుల సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి నాయకులకు సూచించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని వైఎన్ఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌గా పోటీ చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్న ఆశావాహుల పేర్లను నమోదు చేసుకున్నారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. స్థానిక ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎలాంటి గ్రూపు తగాదాలకు వెళ్లకుండా ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. గత ప్రభుత్వం చేసిన అవినీతి అక్రమాలను ఎండగడుతూ, రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని గడపగడపకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఒక జడ్పీటీసీ, 14 సర్పంచ్, 8 ఎంపీటీసీ స్థానాలను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, మాజీ జడ్పీటీసీ దేవదాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు ఊషయ్యగౌడ్, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, రమేష్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, ప్రణీత్ యాదవ్, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టండి

- కాంగ్రెస్ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి



సరూర్‌నగర్ చెరువు కట్టపై క్రేన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ చెరువుకట్టకు సత్వరమే మరమ్మతులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అధికారులను కోరారు. శనివారం సరూర్‌నగర్ చెరువు వద్ద దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం చేస్తుండగా క్రేన్ ఒక్కసారిగా అదుపు తప్పి పైకి లేచి, చెరువులోకి ఒరిగింది. విషయం తెలుసుకున్న రాజశేఖర్‌రెడ్డి చెరువు కట్టను సందర్శించారు. క్రేన్ చెరువులోకి ఒరగడం దురదృష్టకరమని, అదృష్టవశాత్తు ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పిందన్నారు. చెరువు కట్ట దెబ్బతిన్నప్పటికీ గత ప్రభుత్వంలో పాలకులు పట్టించుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని ఆయన ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం ఆదేశాలతో అధికారులు సమగ్రంగా పరిశీలించి దాదాపు రూ.6 కోట్లు విడుదల చేసిందని ఆయన చెప్పారు. వినాయక చవితి, దసరా ఉత్సవాల నేపథ్యంలో పనులు చేపట్టడంలో జాప్యం జరిగిందని, తక్షణమే అధికారులు చెరువు కట్ట పటిష్ఠానికి చర్యలు చేపట్టాలని రాజశేఖర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

విగ్రహాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- బీజేపీ సీనియర్ నాయకుడు రంగారెడ్డి డిమాండ్

చంపాపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ నందనవనంలో వాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి విగ్రహాన్ని తొలగించిన దుండగులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బీజేపీ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హస్తినాపురం డివిజన్ నందనవనంలో వాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి విగ్రహాన్ని శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో పక్కకు తొలగించారు. ఈ మేరకు శనివారం ఆలయాన్ని ఆయన పరిశీలించి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అమ్మవారి విగ్రహాన్ని పక్కకు తొలగించడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, పార్టీ నాయకులు రాజేంద్రప్రసాద్, రాజుగౌడ్, వెంకటేష్‌గౌడ్, శేఖర్‌గౌడ్, జీవన్‌రెడ్డి, చంద్రకాంత్, శ్రీకాంత్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, అనిత, స్వరూప, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



వాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నేత రంగారెడ్డి తదితరులు

యువతి ఆత్మహత్య

కుషాయిగూడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మధుసూదన్‌రెడ్డినగర్‌లో నివసించే బత్తుల ప్రసన్న ప్రైవేటు ఉద్యోగిని. డ్రైవర్‌గా పనిచేసే తన భర్త బత్తుల గోపాల్ నుంచి మే నెలలో విడాకులు తీసుకుంది. అప్పటి నుంచి ఆమె కూతురు సృష్టిత(21)తో కలిసి వేరుగా ఉంటోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఉద్యోగ నిమిత్తం ప్రసన్న బయటకు వెళ్లింది. డిగ్రీ చదువుతున్న సృష్టిత ఇంట్లోనే ఉంది. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కూతురికి ఫోన్ చేసి మాట్లాడిన ప్రసన్న తిరిగి సాయంత్రం 6.30 గంటలకు ఫోన్ చేయగా సృష్టిత స్పందించ లేదు. అద్దెకు ఉంటున్న వారికి ఫోన్ చేసిన ఆమెకు తలుపులు లోపలి నుండి గడియ వేసి ఉందని వారు బదులిచ్చారు. ఆమె సూచనల మేరకు వారు తలుపులు పగులగొట్టి చూడగా సృష్టిత సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. విషయం తెలుసుకున్న ఆమె వెంటనే ఇంటికి వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. సృష్టిత ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ జరుపుతున్నామని పోలీసులు వెల్లడించారు.



సృష్టిత (ఫైల్)

మహిళలకు 'సహోదరి' ఉచిత శిక్షణ

సరూర్‌నగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో గల 'సహోదరి ఫౌండేషన్' ఆధ్వర్యంలో మహిళలకు, యువతులకు పలు ఉపాధి కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు ఫౌండేషన్ అధ్యక్షురాలు స్వర్ణలత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, అడ్వాన్స్‌డ్ బ్యూటీషియన్ తదితర కోర్సుల్లో ఈ శిక్షణ ఉంటుందని ఆమె చెప్పారు. ఆసక్తి గల యువతులు, మహిళలు బాలాపూర్ ఆర్‌సీఐ రోడ్డు(మంచిస్కూల్ దగ్గర)లో గల తమ సంస్థలో నేరుగా, 9985055855లో సంప్రదించి ఆయా కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని స్వర్ణలత తెలిపారు.

డీజీపీని కలిసిన మాజీ మేయర్ 'చిగిరింత'

సరూర్‌నగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీగా నూతనంగా నియమితులైన బత్తుల శివధర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి దంపతులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు బొకే అందజేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పారిజాతారెడ్డి మాట్లాడుతూ తమ సమీప గ్రామమైన పెద్దతూండ్ల (తులేకలాన్)కు చెందిన శివధర్‌రెడ్డి డీజీపీగా నియమితులవడం తమకు గర్వంగా ఉందన్నారు.



డీజీపీని సన్మానిస్తున్న పారిజాతారెడ్డి దంపతులు

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- ఆరుగురి అరెస్ట్ ● రూ. 3.13లక్షలు స్వాధీనం

సరూర్‌నగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో గుట్టు చప్పుడు కాకుండా నడుస్తున్న ఓ పేకాట శిబిరంపై ఎల్బీనగర్ ఎస్ఓటీ, మీర్‌పేట్ పోలీసులు కలిసి దాడి చేసి ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.3.13లక్షలు స్వాధీనం చేసుకున్నారు. బడంగ్‌పేట్‌లోని అన్నపూర్ణనగర్ కాలనీలో సికింద్రాబాద్‌కు చెందిన ముజీబ్ అనే వ్యక్తి కొంత కాలంగా ఓ ఇంట్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు శనివారం మీర్‌పేట్ పోలీసులతో కలిసి ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు సదరు శిబిరంపై దాడి చేశారు. ఆ సమయంలో అక్కడ పేకాట ఆడుతున్న ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.3.13లక్షల నగదుతో పాటు 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు ముజీబ్ పరారీలో ఉన్నట్టు పోలీసులు చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో మందుబాబు హల్‌చల్

- ఎస్ఐపై దాడికి యత్నం.. కేసు నమోదు

సైదాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఓ మందుబాబు రోడ్డుపై హల్‌చల్ చేయడంతో పాటు ఎస్ఐపై దాడికి యత్నించాడు. ఈ ఘటనపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. చంపాపేట చౌరస్తాలో సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు శనివారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. అంతలో బైక్‌పై వచ్చిన సింగరేణి కాలనీకి చెందిన వేమురు శంకర్(30)ను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా మద్యం తాగినట్టు వచ్చింది. దీంతో రెచ్చిపోయిన శంకర్ రోడ్డుపై షర్ట్ విప్పి హంగామా చేశాడు. అంతటితో ఆగకుండా ట్రాఫిక్ ఎస్ఐ వెంకటప్పపై దాడికి యత్నించాడు. సమాచారమందుకున్న సైదాబాద్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మందుబాబును అదుపులోకి తీసుకున్నారు. ట్రాఫిక్ ఎస్ఐ ఫిర్యాదు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డుపై హంగామా చేస్తున్న శంకర్

ఘనంగా సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం

తార్నాక, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సమాజ్‌వాదీ పార్టీ 33వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి యాదవ్ ఆధ్వర్యంలో శనివారం తార్నాకలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన రాష్ట్ర అధ్యక్షుడు పార్టీ పటిష్ఠతకు అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. సమాజ్‌వాది పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





ఇసామియా బజార్ విక్టోరియా ప్లేగ్రౌండ్‌లో అమ్మవారి ఊరేగింపులో ఆకట్టుకున్న నృత్యాలు

దుర్గమ్మా.. వెళ్లి రావమ్మా..

ఎల్బీనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నవరాత్రుల్లో ఘనంగా పూజలందుకున్న అమ్మవారు.. గంగమ్మ ఒడికి చేరుకుంది. ఇసామియా బజార్ విక్టోరియా ప్లేగ్రౌండ్‌లో తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు, యాగాలు, కుంకుమార్చనలు జరుపుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం మహిళలు నెత్తిన బోనం ఎత్తుకుని, పురుషులు వివిధ వేషధారణలో చేసిన నృత్య ప్రదర్శన అందరికి ఆకట్టుకుంది.



చాదర్‌ఘాట్ విక్టోరియా ప్లేగ్రౌండ్స్‌లో 72 అడుగుల అమ్మవారి విగ్రహాన్ని దర్శించుకున్న మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి తదితరులు

నేడు బ్రాహ్మణ మేధావుల సమావేశం

ఎల్బీనగర్: బ్రాహ్మిణ్ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ (బాస్) ఆధ్వర్యంలో ఆదివారం బ్రాహ్మణ మేధావుల సమావేశం జరగనుందని బాస్ టీం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.